ప్రజాశక్తి
గురువారం 13 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

22న హైడ్రోపవర్ ప్రాజెక్టు వ్యతిరేక సదస్సు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని మనసభద్ర పంచాయతీ పరిధిలోని దుగ్గేరు పరిసరాలలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఈనెల 22న జరిగే సదస్సును విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం పిలుపునిచ్చింది. గిరిజనులకు తీవ్ర నష్టం చేకూర్చే ఈ ప్రాజెక్టు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని దుగ్గేరులో ప్రజా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు టి.ప్రభాకర్, సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు కోరారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు.

ఐటిడిఎకి అధికారులు కావలెను

ఐటిడిఎలను నీరుగార్చే విధానాలను సర్కారు అవలంబిస్తోందా? గిరిజనాభివృద్ధిపై ప్రభుత్వం శీతకన్ను వేస్తోందా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటుచేసిన ఐటిడిఎలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోంది. ఐటిడిఎలో కీలకపోస్టులను ఏళ్ల తరబడి భర్తీ చేయకపోవడమే అందుకు నిదర్శనం. ఒకటీ రెండూ కాదు.. కీలకపోస్టులన్నీ ఇన్‌ఛార్జులతో నెట్టుకొచ్చే దుస్థితి దాపురించింది.

సీతంపేట ఐటిడిఎ కార్యాలయం

- పిఒ, ఎపిఒ, జిసిసి డిఎం పోస్టులన్నీ అదనపు బాధ్యతలే
- ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్న వైనం
- సీతంపేట ఐటిడిఎలో గాడితప్పుతున్న పాలన

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో ఏడాదిన్నరగా కీలకమైన పిఒ పోస్టును ఇన్‌ఛార్జితో నెట్టుకొస్తున్నారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 20 మండలాల్లో సుమారు రెండు లక్షల మంది గిరిజనులు నివశిస్తున్నారు. రెగ్యులర్ పిఒ ఉంటే ఐటిడిఎ సంక్షేమ పథకాలు పేదలకు నేరుగా అందేలా చూడాల్సిన బాధ్యత ఉంటుంది. అంతేకాక రహదారులు, భవనాలు పర్యవేక్షణ, నూతన పథకాలు గిరిజనులకు చేరువ చేయడం, విద్యా ప్రమాణాలు, గిరిజనుల ఆరోగ్యంపై దృష్టిపెట్టడం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, అత్యవసర సమయంలో కీలక నిర్ణయాలు తీసుకోవడం, ఐటిడిఎ ద్వారా కొత్త కార్యక్రమాలు ప్రవేశ పెట్టడం.. ఇలా అన్ని శాఖలపై పట్టుసాధించి ఐటిడిఎ అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంది. గతేడాదిన్నర కాలంగా పాలకొండ సబ్‌కలెక్టర్‌కు ఇన్‌ఛార్జి పిఒగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో దేనికీ న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది. గతంలో యశ్వంత్‌కుమార్ పాలకొండ సబ్‌కలెక్టర్‌గా ఉన్న సమయంలో సీతంపేట ఐటిడిఎ పిఒగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సుమారు 11 నెలలు ఇన్‌ఛార్జి పిఒగా కొనసాగారు. అనంతరం ఐఎఎస్ బదిలీల్లో పాలకొండ సబ్‌కలెక్టరుగా పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌ను ప్రభుత్వం నియమించింది. దాంతోపాటు సీతంపేట ఐటిడిఎ పిఒగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పిఒగా ఆగస్టులో బాధ్యతలు స్వీకరించారు. రెండు బాధ్యతలతో దేనికీ న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది.

ఐటిడిఎ ఎపిఒ చినబాబు రెగ్యులర్ అయినప్పటికీ వ్యక్తిగత పనులపై దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి వెంకట గణేష్‌కు ఇన్‌ఛార్జి ఎపిఒ బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇప్పటికే అదనంగా ప్రాజెక్టు అగ్రికల్చర్ అధికారి బాధ్యతలు చూస్తున్నారు. ఆయనకు హార్టికల్చర్ ద్వారా 20 మండలాల్లో గిరిజనులకు జీడి మామిడి, పనస, పైనాపిల్, తదితర పంటలపై అవగాహన కల్పించాల్సి ఉంది. దాంతోపాటు వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందించిన పనిముట్లు రాయితీలో ఇవ్వాల్సి ఉంది. వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలన్నీ చేపట్టాలి. ఎపిఒగా అదనపు బాధ్యతలతో ఐటిడిఎలో ప్రతి ఫైలు చూడాల్సి ఉంటుంది. ఐటిడిఎ కూడా పర్యవేక్షణ చేయాల్సి ఉంది. మూడు బాధ్యతల స్వీకరించడంతో తలకు మించిన భారం అవుతుంది.

డిడి అన్నదొర రెగ్యులర్ అయినా, ఐటిడిఎ కేంద్రమైన ఎటిడబ్ల్యూఒ పోస్టు ఖాళీగా ఉండటంతో అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో డిడిగా 47 ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్టుమెట్రిక్ వసతిగృహాలపై పర్యవేక్షణ చేయాల్సి ఉంది. అయితే అదనంగా ఎటిడబ్ల్యూఒ విధులు అప్పగించడంతో డిడికి భారమౌతుంది. సుమారు 15 వేల మంది విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాలు మెరుగు పరచడం. నిర్వహణ పర్యవేక్షణ, ఉద్యోగుల జీతాలు, ఇలా అన్ని చూడాల్సిన బాధ్యత ఉంది.

గిరిజన సహకార సంస్థ (జిసిసి)కి గత మూడేళ్లుగా రెగ్యులర్ డిఎం లేక ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. గిరిజన సహకార సంస్థ జనరల్ మేనేజర్ సంధ్యారాణి విశాఖపట్నంలో ఉంటారు. సీతంపేట డివిజనల్ కార్యాలయంలో డిఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. డిఎం అత్యవసరమైతే తప్ప రాలేని పరిస్థితి నెలకొంది. సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న వసతిగృహాలకు జిసిసి ద్వారా నిత్యావసర సరుకులు సరఫరా చేయాల్సి ఉంది. డిపోల పర్యవేక్షణ, అటవీ ఉత్పత్తుల సేకరణ, ధాన్యం కొనుగోలు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా బాధ్యతలు ఉన్నాయి.

పశుసంవర్ధ శాఖ ఎడి శ్రీనివాసరావు తెర్లాంలో మూడు రోజులపాటు విధులు నిర్వహిస్తే, సీతంపేట మండలంలో మూడు రోజులపాటు పనిచేస్తున్నారు. ఐటిడిఎ ఎఒ సునీల్‌కు అదనంగా మేనేజర్ బాధ్యతలు అప్పగించారు. ఎఎఒ విజయరాణికి అదనంగా ఇన్‌ఛార్జి అకౌంట్ మేనేజర్ పోస్ట్ బాధ్యతలు అప్పగించారు.

గురుకులంలో పర్యటిస్తున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు

గురుకులాన్ని సందర్శించిన ఎన్‌హెచ్‌ఆర్‌సి

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం గురుకుల పాఠశాలలో విద్యార్థుల మృతిపై ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ మానవ హక్కుల కమిషన్ బుధవారం సమగ్రంగా విచారణ చేపట్టింది. కమిషన్ సభ్యులు బుధవారం ఉదయం పాఠశాలకు చేరుకుని, అక్కడి వసతిగృహాలు, భోజనశాల, తరగతి గదులు, ఆరోగ్య సదుపాయాలు తదితర విభాగాలను అణువణువూ పరిశీలించారు. ప్రిన్సిపల్ విజయలక్ష్మి, సిబ్బందితో మాట్లాడి, విద్యార్థుల మరణానికి దారితీసిన పరిస్థితులపై పాఠశాల వివరాలు సేకరించారు. అనంతరం మరణించిన విద్యార్థుల కుటుంబాలను వ్యక్తిగతంగా కలిసి, తల్లిదండ్రులతో మాట్లాడి, వారి నుంచి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

వరహాలగెడ్డ భూమి చుట్టూ ట్రెంచ్

ప్రజాశక్తి కథనానికి స్పందన

జెసిబితో ట్రెంచ్ తవ్విస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పార్వతీపురం

పట్టణ నడిబొడ్డున ఉన్న వరహాల గెడ్డ స్థలం చుట్టూ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు బుధవారం ట్రెంచ్ కట్ చేసి హద్దులు నిర్ణయించారు. తహశీల్దార్ సురేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, సర్వే శాఖ అధికారులు సర్వే నెంబర్ 410లో ఉన్న వరహాల గెడ్డ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలానికి హద్దులు నిర్ణయించారు. గత నెలలో ఈ స్థలంతో కలిపి 411-9లో ఉన్న జిరాయితీ స్థలంగా చూపించిన వ్యాపారి మొత్తం స్థలాన్ని విక్రయించారు. దీనిపై వరహాలగెడ్డ భూమి విక్రయం అనే శీర్షికతో మంగళవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు ఎట్టకేలకు స్పందించారు. స్థలం చుట్టూ జెసిబితో ట్రెంచ్ కట్ చేసి అధికారులు చేతులు దులుపు కోకుండా జరిగిన రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాం

మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు.. ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

పేదలకు సొంతింటి కల నెరవేర్చడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సాలూరు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో బుధవారం లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ పేదలకు సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో ఇంటి నిర్మాణాలకు ఆర్థిక తోడ్పాటును అందిస్తుందన్నారు. సాలూరు మున్సిపాలిటీలో మొత్తం 195 ఇళ్లకు ఆమోదం లభించిందని తెలిపారు. సాలూరు, పార్వతీపురం, పాలకొండ పట్టణాల్లో కొత్తగా మరో 634 ఇళ్లకు ఆమోదం లభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.టి.రత్నకుమార్, హౌసింగ్ డిఇ చిన్నంనాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని జగన్నాథపురంలో నూతనంగా నిర్మించిన గృహాలను ఎమ్మెల్యే విజయ్‌చంద్ర, కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 340 మంది పట్టణ పేదలకు ఇల్లు మంజూరు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలు కలెక్టర్, సబ్ కలెక్టర్ వైశాలితో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో రోడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ద్వారపు రెడ్డి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని లుంబేసు పంచాయతీ లప్పటి గ్రామంలో ప్రధాన మంత్రి అవాస్ యోజనలో నిర్మించిన ఇంటిని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, బిజెపి ఎస్‌టి మోర్చా జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, మాజీ ఎంపిపి తాడంగి లక్ష్మణరావు, ఎంపిడిఒ ఐ.వి.లక్ష్మి, హౌసింగ్ డిఇ ఎన్.వెంకటరావు, ఎఇ ఆర్.శ్రీనివాసరావు, ఎంపిటిసి గౌరమ్మ, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, నియోజకవర్గ డెవలప్మెంట్ అధికారి శరత్, నాయకులు తోయక కామేష్, జమ్మయ్య, జయంత్, జానకి, కొండలరావు, రాజేష్, రామారావు, గుంజన్న, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురంలో గృహప్రవేశాల్లో పాల్గొన్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విజయ్‌చంద్ర, జగదీశ్వరి

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి

సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు

ప్రజాశక్తి-సీతానగరం

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యం కోతలు కోసి, నూర్పిడి చేస్తున్నారని తెలిపారు. పేద రైతులకు పంట నిల్వ చేసుకునే సామర్థ్యం లేదని చెప్పారు. దీనిని ఆసరా చేసుకున్న ప్రయివేటు వ్యక్తులు, దళారులు రైతులను దగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలో సీతానగరం, బలిజిపేట, తదితర మండలాల్లో ముమ్మరంగా నూర్పిళ్లు సాగుతున్నాయని చెప్పారు. మరోవైపు నేటికీ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రక్షణ కల్పించాలని, కౌలు కార్డులు ఇవ్వని వారికి వెంటనే మంజూరు చేయాలని కోరారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా ధాన్యం పండించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.600 బోనస్ ప్రకటించాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో సిపిఎం మండల నాయకులు గవర వెంకటరమణ, రాయిపల్లి రాము, ఆర్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

మన్యం గజగజ

పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో చలిమంట కాగుతున్న గిరిజన యువత

మన్యం జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగ మంచు, చల్లని గాలులకు మన్యం గజగజలాడుతోంది. నవంబర్‌లోనే ఏజెన్సీ అంతటా పొగమంచు కప్పేస్తోంది. దీంతో రహదారి కనిపించని పరిస్థితి నెలకొంది. ఉదయం వేళ ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు 8 గంటల తరువాత ప్రయాణాలు పెట్టుకుంటున్నారు. రాత్రి వేళ ఉష్ణోగ్రతలు 14 డిగ్రీల స్థాయికి పడిపోతున్నాయి. ముఖ్యంగా గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ చుట్టూ ఎత్తయిన కొండలు ఉండటం, చుట్టూ నీరు, దట్టమైన పొగ మంచు కురవడంతో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు అవుతున్నాయి. చలి తీవ్రత కారణంగా వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబర్, జనవరి నెలల్లో చలి ప్రభావం అత్యధిక స్థాయిలో ఉంటుంది.

విద్యాదాఘాతంతో లారీటైర్లు దగ్ధం

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

కాలిపోతున్న లారీ టైర్లు

విద్యుదాఘాతంతో లారీ టైర్లు దగ్ధమయ్యాయి. ఈ సంఘటర పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పార్వతీపురం పట్టణంలో బుధవారం లారీపై జెసిబిని తరలిస్తున్నారు. ఆ సమయంలో విద్యుత్ తీగలు తగిలి షార్ట్‌సర్క్యూట్ కావడంతో లారీ టైర్లు దగ్ధమయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే శ్రీచైతన్య స్కూల్ పాఠశాల సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. రహదారిపై ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న సీతంపేట ఐటిడిఎ బాలుర జట్టు

ఓవరాల్ ఛాంపియన్ సీతంపేట ఐటిడిఎ

ప్రజాశక్తి-సీతంపేట

జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా సీతంపేట ఐటిడిఎ నిలిచింది. సీతంపేట ఐటిడిఎకు చెందిన బాలురు ఛాంపియన్‌షిప్, బాలికల ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా వీరిని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎపిఒ, డిడి, డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్, దయానంద్, ఇతర పీడీలు, పిఇటిలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణతో

పేద విద్యార్థులకు తీవ్ర నష్టం

- ప్రయివేటు చేతుల్లో పెడతామంటే చూస్తూ ఊరుకోం
- మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్పశ్రీవాణి
- వైసిపి ఆధ్వర్యాన నిరసన ర్యాలీలు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, సాలూరులో ర్యాలీలు చేపడుతున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణతో పేద, సామాన్య విద్యార్థులకు వైద్యవిద్య అందని ద్రాక్షగా మారుతుందని మాజీ డిప్యూటీ సిఎం ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ప్రజా ఉద్యమంలో భాగంగా బుధవారం జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టారు. అందులో భాగంగా వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, పుష్పశ్రీవాణి ఆధ్వర్యాన కురుపాంలో పెట్రోల్ బంకు నుంచి రావాడ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని, తహశీల్దార్ కె.జయకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పుష్పశ్రీవాణి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, విద్యపై దృష్టి పెట్టి కొత్త మెడికల్ కాలేజీలు స్థాపించిందని గుర్తుచేశారుక. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ ప్రజాహిత నిర్ణయాలను రద్దు చేసి, ప్రయివేట్ చేతుల్లో పెట్టడానికి కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వెంటనే వైద్యకళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎం.బాపూజీ నాయుడు, ఎంపిపిలు శెట్టి పద్మావతి, కె.దీనమయ్య, ఎస్.శ్యామల, జెడ్‌పి కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, వైసిపి మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ నూరుల్లా, నియోజకకర్గంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సాలూరు పట్టణంలో గురువారం మాజీ డిప్యూటి సిఎం పీడిక రాజన్నదొర ఆధ్వర్యాన భారీ ర్యాలీ చేపట్టారు. రాజన్నదొర క్యాంపు కార్యాలయం నుంచి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన 'ప్రజా ఉద్యమం' కోటి సంతకాల సేకరణ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నా కూటమి ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. వైద్య విద్యను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రజలందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి పాలకొండ పరిశీలకులు మావుడి శ్రీనివాస నాయుడు, పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, గిరి రఘు, దండి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీనివాసరావు, మావుడి రంగు నాయుడు, చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పార్వతీపురంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన భారీ ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు, ఆర్‌డిఒకు జోగారావు, వైసిపి నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం జోగారావు మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రయివేటీకరణపై టిడిపి కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుందని, దీనివల్ల పేద విద్యార్థులు నష్టపోతారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పిపిపి నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైసిపి జిల్లా నాయకులు బలగ శ్రీరాములు నాయుడు, పోల సత్యనారాయణ, తప్పిట ప్రసాద్, మండల, పట్టణాధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, జెడ్‌పిటిసిలు అలజంగి రవికుమార్, బలగ రేవతమ్మ, మామిడి బాబ్జీ, ఎంపిపిలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, రంగుముద్ర గణపతి, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో పాలకొండలో ర్యాలీ చేపట్టారు. కార్గిల్ పాయింట్ దగ్గర వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కళావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుండి బైక్ ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ వైద్య విద్య అభ్యసించాలనుకున్న విద్యార్థులకు టిడిపి కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా పిపిపి విధానం లేదని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరఘట్టం ఎంపిపి దమలపాటి వెంకటరమణ, జెడ్‌పిటిసి సరస్వతి, వైసిపి పాలకొండ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాశ్, పట్టణ అధ్యక్షులు యలమల మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.





పార్వతీపురం, పాలకొండలో నిరసనలు చేపడుతున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

రోడ్డుపైనుంచి ప్రవహిస్తున్న నీరు

సాగునీరు వృథా

చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి-పాలకొండ

రైతుల పొలాలకు అందాల్సిన నీరు రోడ్లపై వృథాగా పోతోంది. తోటపల్లి ఎడమ కాలువ ద్వారా పొలాలకు వెళ్లాల్సిన నీరు వృథాగా పోయి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. పట్టణంలో నీలమ్మ కాలనీ దగ్గర ఇరిగేషన్ కాలువలో నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి అయితే అక్కడ ప్రజలు నడవడానికి కూడా భయపడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు మాత్రం దీనిపై చోద్యం చూస్తున్నారు. సాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో అటు రైతుల నుంచి, ఇటు కాలనీవాసుల నుంచి కూడా విమర్శలు వినిపిస్తున్నాయి.

మహిళల రక్షణకు శక్తి యాప్

ప్రజాశక్తి-కొమరాడ

ఆపద సమయాలలో మహిళల భద్రత కోసం శక్తి యాప్ ఉపయోగపడుతుందని శక్తి టీం ఎఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని మార్కొండపుట్టి జిల్లా పరిషత్ హైస్కూల్, చంద్రంపేట, పరుశురామపురం మండల ప్రాథమిక పాఠశాలల్లో శక్తి టీం సభ్యులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ మాట్లాడుతూ ప్రతి మహిళా ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌనలోడ్ చేసుకుని, పోలీసుల సాయం పొందేలా చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా హింసాత్మక ఘటనల నుంచి మహిళలు రక్షణ పొందవచ్చని అన్నారు. ఏదైనా ప్రమాదం తలెత్తితే యాప్ ఓపెన్ చేసి ఎస్ఒఎస్ బటనను నొక్కితే.. బాధితులు ఉన్న ప్రాంతాన్ని పోలీసులు గుర్తించి, తక్షణమే స్పందిస్తారని తెలిపారు. కార్యక్రమంంలో మహిళా పోలీస్ కానిస్టేబుల్ నిర్మల, పద్మ పాల్గొన్నారు.

షాపుల యజమానులకు నోటీసులు

ప్రజాశక్తి-మక్కువ

మండల కేంద్రంలో పరిశుభ్రత పాటించాలంటూ బుధవారం రహదారికి ఆనుకుని ఉన్న దుకాణాల యజమానులకు ఎంపిడిఒ అర్జునరావు నోటీసులు అందజేశారు. కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి మంగళవారం రాత్రి దుకాణాలను సందర్శించిన నేపథ్యంలో ఆరుబయట అపరిశుభ్రంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశుభ్రత పాటించాలని, ప్రతిఒక్కరూ దుకాణాల వద్ద డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని సూచిస్తూ నోటీసులు అందజేశారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని అర్జునరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మక్కువ ఇఒ బి.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపిడిఒ సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాడికొండలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వ్యవసాయ శాఖ, ఎపి సిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని తాడికొండలో దీవెన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని బుధవారం మాజీ సర్పంచ్ అడ్డాకుల కుసుమమ్మ ప్రారంభించారు. వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ అడ్డాకుల చిన్నారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఒఎస్ఎస్ సహకారంతో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు కిల్లక వెంకటేష్, ఆరిక సుజాత తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు అడ్డాకుల జయబాబు, తోయక మల్లేష్, మహిళా ప్రతినిధి మండంగి ప్రభావతి, గిరిజన రైతులు ఉన్నారు.

14న న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పార్వతీపురం

బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రెండో అదనపు న్యాయమూర్తి ఎస్.దామోదరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవగాహన సదస్సులో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-సీతంపేట

ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రతి విద్యార్థి పాల్గొని విజయవంతం చేయాలని గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు కోరారు. వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డిబేట్, ఆటలు, పాటలు, రంగవల్లుల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 20న ముగింపు సభలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబర్చి, మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించిన హోంగార్డుల పిల్లలను జిల్లా ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి అభినందించి మెరిట్ స్కాలర్ షిప్ లను బుధవారం అందజేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఉన్నత విద్యతో మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని, అందుకు తగిన విధంగా విద్యార్థులు శ్రద్ధ, క్రమశిక్షణతో చదువు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, వెల్ఫేర్ ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, పోలీసు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రామభద్రపురం

ఆరికతోట యూత్ ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన నిరుపేద కూరపాటి సత్యారావు శస్త్ర చికిత్సకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా 21వేలు సేకరించి స్థానిక ఎస్ఐ ప్రసాదరావు చేతుల మీదుగా బుధవారం నగదు అందజేశారు. గత కొంతకాలంగా సత్యారావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువత వారికి అండగా నిలిచి నగదు అందించడం సంతృప్తిని కలిగించిందని ఎస్ఐ అన్నారు. యువత గ్రామాల్లో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, రవాణా వంటి వాటిని నివారించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎస్ఐ చేస్తున్న సమాజసేవకు యువత ఆధ్వర్యంలో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘ సభ్యులు అశోక్, రత్నప్రసాద్, కృష్ణ, చిన్నారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సామాజిక తనిఖీ

ప్రజాశక్తి- మెరకముడిదాం

పాఠశాల పనితీరు, నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలపై పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడం గూర్చి ఎంపియుపి ఇప్పలవలస పాఠశాలలో సామాజిక తనిఖీ బుధవారం నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి పాఠశాల వాతావరణం, బోధన నాణ్యత, మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాలపై నేరుగా అభిప్రాయాలను సేకరించారు. పాఠశాలకు వచ్చిన ప్రభుత్వ గ్రాంట్లు, నిధులు, వాటి ఖర్చు వివరాలను తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు బహిరంగంగా వివరించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, పాఠశాలలో మెరుగుపడాల్సిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయిన వారికి ఆకులు..
కాని వారికి కంచాలు

- మంత్రి ఇలాకాలో తెలుగు తమ్ముళ్ల అసంతృప్తి
- పదవుల్లో ప్రధాన సామాజిక తరగతులకు మొండిచేయి

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలో నివురు కప్పిన నిప్పులా అసంతృప్తి రాజుకుంటోంది. పార్టీ ఆవిర్భావం నుంచి అంటిపెట్టుకుని ఉన్న సీనియర్ నాయకులను దూరం పెట్టిన పరిస్థితి కనిపిస్తోంది. గత 16 నెలలుగా నియోజకవర్గంలో మంత్రి సంధ్యారాణి వ్యవహారశైలిపై సీనియర్ నాయకులు, కార్యకర్తలు కక్కలేక, మింగలేక అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పార్టీలో తాము ఎదుర్కొంటున్న అవమానాలను, ఇబ్బందులను ఎవరితో చెప్పుకోవాలో తెలియని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల మంత్రి సిఫార్సుతో చేపట్టిన నామినేటెడ్ పదవుల భర్తీలో నియోజకవర్గంలో ప్రధాన సామాజిక తరగతులకు చెందిన నాయకులకు మొండిచేయి చూపడం చర్చనీయాంశమవుతోంది.

తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి టిడిపి మాజీ కౌన్సిలర్ మజ్జి చిరంజీవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ పార్టీలో గాని, మండల పార్టీలో గాని కాపు సామాజిక తరగతికి చెందిన అనేకమంది నాయకులు ఉన్నారు. వారందరినీ కాదని కాపు సామాజిక తరగతికి చెందని నాయకుడిని కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడం పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేస్తోంది. సాలూరు, పాచిపెంట, మెంటాడ, మక్కువ మండలాలతోపాటు మున్సిపాలిటీలోనూ అదే సామాజిక తరగతికి చెందిన నాయకులు చాలామంది ఉన్నప్పటికీ మొండిచేయి చూపడంతో వారంతా తీవ్ర అంతర్మథనం చెందుతున్నారు. శ్యామలాంబ ఆలయ ట్రస్టు కమిటీ నియామకంలోనూ మరో సామాజిక తరగతికి చెందిన నాయకులను విస్మరించడం వివాదాస్పదమవుతోంది. నియోజకవర్గంలో మైనారిటీ నాయకుడికి, వైసిపి నుంచి ఎన్నికల ముందు టిడిపిలో చేరిన నాయకులకు ట్రస్ట్ కమిటీలో ప్రాధాన్యత కల్పించడంతో సీనియర్ నాయకులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న పరిస్థితి ఏర్పడింది. బుధవారం శంబర ఆలయ ప్రాంగణంలో ట్రస్టు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం జరిగింది. నియామకమైన పది మంది సభ్యులలో సగం మంది వైసిపి నుంచి వలస వచ్చిన నాయకులేనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

మంత్రి సంధ్యారాణి వ్యవహార శైలి మొదటి నుంచి అయిన వారికి ఆకులు, కాని వారికి కంచాలు అన్న చందంగా ఉందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. శంబర పోలమాంబ ట్రస్ట్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కాలేదు. ఈ పరిస్థితిని ముందే ఊహించిన మంత్రి సంధ్యారాణి వ్యూహాత్మకంగా నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి క్లస్టర్, బూత్ కమిటీల పేరుతో నాయకులకు ట్రస్ట్ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి రప్పించడం చర్చనీయాంశమైంది. నియోజకవర్గంలో టిడిపిని భూస్థాపితం చేయడమే లక్ష్యంగా మంత్రి సంధ్యారాణి పని చేస్తున్నారని మక్కువ మండలానికి చెందిన సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధిష్టానం నియోజకవర్గ పరిస్థితిపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలో బుధవారం ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు కల్చరల్ పోటీలు నిర్వహించారు. విజేతలు గురువారం జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఇఒ తెలిపారు. న్యాయనిర్ణేతగా గౌరునాయుడు వ్యవహరించారు.

సీతానగరం : స్థానిక ఎంఆర్‌సి భవనంలో మండల స్థాయి ఆటలు పోటీలను బుధవారం నిర్వహించారు. విజేతలను జిల్లా స్థాయికి పంపించనున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు వేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శంకర్రావు, మండల స్థాయి అధికారులు జి సత్యం నాయుడు, డి.కళ్యాణిదుర్గ, జె.సౌజన్య, డి.కావ్యశ్రీ, జ్ఞానమ్మ, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో న్యుమోనియా లక్షణాలు గుర్తించాలి

డిఎంహెచ్ఒ భాస్కరరావు

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-పార్వతీపురం

పిల్లల్లో న్యూమోనియా లక్షణాలు గుర్తించి సకాలంలో తగు చికిత్స అందించాలని డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు సూచించారు. ప్రపంచ న్యుమోనియా దినం సందర్భంగా అవగాహన సదస్సును బంగారమ్మ కాలనీ 17వ వార్డులో బుధవారం నిర్వహించారు. డిఎంహెచ్ఒ, ప్రోగ్రాం అధికారులు కార్యక్రమంలో పాల్గొని బాలింతలు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. భాస్కరరావు మాట్లాడుతూ చిన్నారుల్లో శ్వాస సంబంధిత సమస్యల్లో న్యూమోనియా ప్రాణాంతకమైనదని తెలిపారు. అవగాహన, ముందస్తు గుర్తింపుతో కాపాడుకోవచ్చని తెలియజేశారు. వైద్యారోగ్యశాఖ ప్రవేశపెట్టిన శాన్స్ ప్రోగ్రాం ద్వారా వైద్య సిబ్బంది గృహ సందర్శనలు చేసి ఐదేళ్లలోపు పిల్లల్లో న్యుమోనియా, ఇతర శ్వాస సంబంధిత లక్షణాలు గుర్తించి తగు చికిత్సను సకాలంలో అందించాలని సూచించారు. లక్షణాల్లో ముఖ్యంగా తీవ్రమైన దగ్గు, వేగంగా శ్వాస తీసుకోవడం, ఛాతి లోపలకు పోవడం, జ్వరం, తాగకపోడం, తినకపోవడం, మూర్చ ద్వారా గుర్తించవచ్చన్నారు. మొదటి ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలు తప్పనిసరని, పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలని చెప్పారు. పిసివి టీకా 6, 14 వారాలు, 9 నెలల్లో తప్పనిసరిగా వేయించాలన్నారు. ఇళ్లలో వెంటిలేషన్ సరిగా ఉండేలా చూసుకోవాలని కోరారు. బిడ్డను వెచ్చని బట్టతో కప్పి ఉంచడం మొదలగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఒ వై.విజయ్ మోహన్, ప్రోగ్రాం అధికారులు టి.జగన్ మోహనరావు, రఘుకుమార్, సూర్య కౌశిక్, సూపర్వైజర్ పుష్ప, డెమోలు గిరిబాబు, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గేరులో ముురుగుతో ఉన్న రహదారిని పరిశీలిస్తున్న జనసేన నాయకులు తిరుపతిరావు, తదితరులు

ప్రభుత్వం దృష్టికి ప్రజాసమస్యలు

జనసేన నాయకులు పెంట తిరుపతిరావు

ప్రజాశక్తి-మక్కువ

గిరిజన ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జనసేన పార్టీ నాయకులు పెంట తిరుపతిరావు అన్నారు. బుధవారం పనసభద్ర పంచాయతీలో జనసైనికులతో కలిసి ఆయన పర్యటించారు. బాగుజోల గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణం కూడా చేపట్టలేదని, ఇంటింటి కొళాయి పరిస్థితి కూడా అధ్వానంగా ఉందని చెప్పారు. గతేడాది గ్రామంలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పర్యటించినా అక్కడి సమస్యలు అలాగే ఉన్నాయని, అధికారులు స్పందించలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. దుగ్గేరులో ఒక వీధిలో రహదారి సౌకర్యం లేక అవస్థలు పడుతున్న విషయాన్ని స్థానికులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఈ సందర్భంగా దుగ్గేరులో జనసేన జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో దేసరి బాలకృష్ణ, నాగరాజు, జీవన్‌కుమార్, సుబ్బుకోన గ్రామానికి చెందిన రాకెట్ శాంతంనాయుడు, తాడి ఆదినారాయణ, దబ్బ గడ్డ గ్రామానికి చెందిన మింది త్రినాథ, పువ్వల సత్యనారాయణ, కొయ్యనుపేటకు చెందిన రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి బాధ్యత జిసిసిదే

ప్రజాశక్తి-కొమరాడ

మాట్లాడుతున్న జిసిసి డిఎం రామారావు

గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసే బాధ్యత జిసిసిదేనని జిసిసి పార్వతీపురం డిఎం జె.రామారావు అన్నారు. మండలంలోని పెద్దశాఖ డిపో పరిధిలోని గిరిజనులకు అటవీ ఉత్పత్తుల సేకరణ, అమ్మకాలపై ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

పిక్క తీయని చింతపండు కిలో రూ.36, పిక్క తీసిన చింతపండుకు రూ.67 ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. కిలో ఇంగువ పిక్కలు రూ.50, నల్ల జీడిపిక్కలు రూ.32, ముసిడి పిక్కలు రూ.100 ధర ప్రకటించారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిసిసి డివిజన్ మేనేజర్ ఎం.సాంబశివరావు, సిబ్బంది అనసూయ, బి.మంగ, కె.క్రిష్ణ, అంబటి మంగ, గౌరీశంకర్ రావు పాల్గొన్నారు.

భద్రగిరి ఆస్పత్రి పనులు పరిశీలన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి సిహెచ్‌సి నూతన భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. డిసిహెచ్ఎస్ నాగభూషణ్‌తో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే రోగులకు మరిన్ని మెరుగైన సేవలు అందడానికి వీలుంటుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చేతుల మీదుగా ఆసుపత్రి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండల కన్వీనర్లు కొండయ్య, నరేష్ తదితరులు ఉన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ తిరుపతిరావు

అదనపు ఆదాయంపై దృష్టిపెట్టాలి

ప్రజాశక్తి-పాచిపెంట

పొలంలో 'ఎల్' ఆకారపు వెడల్పాటి గట్లను తయారు చేసుకుని, దానిపై కూరగాయలు, పండ్ల మొక్కలు నాటుకుని రైతులు అదనపు ఆదాయం పొందాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. అమ్మవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎల్ ఆకారపు గట్లు, ఎటిఎం కూరగాయల మోడల్‌పై సిఆర్‌పి విజయ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. రైతులు సమీకృత వ్యవసాయ విధానాలను తప్పనిసరిగా అవలంబించాలని ఎఒ కోరారు

చెల్లంనాయుడువలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని చెల్లంనాయుడువలసలో బుధవారం ఆయుర్వేద, హోమియో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయుష్, హోమియో వైద్యాధికారులు టి.హేమాక్షి, బి.సుశీల 90 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. శీతాకాలంలో వచ్చే పలు రుగ్మతలకు ఆయుర్వేదం, హోమియో వైద్యంతో మెరుగైన ఫలితాలు ఉంటాయని వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వాకాడ పారినాయుడు, ఆయుష్ సిబ్బంది వై.పద్మ, పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

కమిటీల నిర్మాణం కోసం సమావేశం

ప్రజాశక్తి-పాలకొండ

టిడిపి మండల కమిటీల నిర్మాణం కోసం బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు సమావేశం అయ్యారు. కమిటీలు ఏ ప్రాతిపదికన వెయ్యాలన్న అంశాలను చర్చించారు. ఈ సమావేశంలో తెలుగు యువత అరకు పార్లమెంట్ అధ్యక్షులు వారాడు సుమంత్ నాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ ముంజెట త్రినాథ, నీటి సంఘం మాజీ అధ్యక్షులు మజ్జి జయశంకర్, గుమ్మడి సింహాద్రి, వి.రమణ తదితరులు ఉన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బి.విజయ్‌చంద్ర లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని గుచ్చిమి గ్రామానికి చెందిన సావిత్రమ్మ కుటుంబ సభ్యులకు రూ.37,205, గాదెలవలస గ్రామానికి చెందిన భోగి సాంబమూర్తి కుటుంబ సభ్యులకు 67,832 రూపాయలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల్ నాయుడు, మండల నాయకులు భోగి శంకరరావు, గుచ్చిమి కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు బోరాడ చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

51 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వీరఘట్టం

నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ జాక్సన్

మండలంలో చిట్టపూడివలస గ్రామ కూడలిలో సత్య సాయి నిత్య అన్నపూర్ణ సేవాసమితిలో బుధవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో వైద్యాధికారి ఎస్.జాక్సన్ 51 మందికి కంటి పరీక్షలు చేశారు. 31 మందిని ఎంపిక చేసి శస్త్ర చికిత్సలకు విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన కంటి రోగులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటరమణ, సేవా సమితి నిర్వాహకులు సీతంనాయుడు పాల్గొన్నారు.

గోనెసంచులు పంపిణీ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం పంచాయతీలో పొడి చెత్త సేకరణ కోసం ఎస్ఎన్‌యు సంస్థ ఆధ్వర్యంలో షాపులకు గోనె సంచులు పంపిణీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సురేష్ తెలిపారు. సంపద తయారీ కేంద్రం వద్ద ఉన్న 61 కేజీల పొడి చెత్తను ఎస్ఎన్‌యుకు అందించినట్లు చెప్పారు.

ఎయిర్‌పోర్టులో ఉపాధి కల్పించండి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

భోగాపురంలో నిర్మితమవుతున్న అంతర్జాతీయ విమానాశ్రయంలో వివిధ రంగాల డిపార్ట్మెంట్‌ల్లో జిల్లాకు యువతకుఉపాధి అవకాశాలు కల్పించాలని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డిని కోరారు బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. విమానాశ్రయం వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 20 వేల మంది కి ఉపాధి అవకాశాలు ఉంటాయని, జిల్లాలోని మంత్రి, అధికారులు, ఎమ్మెల్యేలు దృష్టి సారిస్తే శిక్షణ ఇచ్చి యువతను నియమించుకోవచ్చని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పత్తి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులంతా ఈ కొనుగోలు కేంద్రం లోనే వారి పంటను విక్రయించాలని, దళారీలను, మధ్యవర్తులను నమ్మవద్దని తెలిపారు. పత్తి రైతులు తమ ఉత్పత్తిని ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.8,110 కంటే తక్కువ ధరకు మధ్యవర్తులకు విక్రయించకుండా, నేరుగా రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద విక్రయించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ, నెల్లిమర్ల ఐడిఎ పరిధిలో గురువారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల పారిశ్రామిక ప్రాంతంలో నిర్మాణం రంగం 11కెవి లైన్ విస్తరణ, ఆర్‌డిఎస్ఎస్ వ్యవసాయ కనెక్షన్ సర్గేషన్ పనులు, చెట్టు కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నందు వల్ల సారిపల్లి 11కెవి రూరల్ ఫీడర్ పరిధిలో సారిపల్లి గ్రామంతో బాటు ఎజిఎల్ సప్లయ్‌కు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదార్లు సహకరించాలని కోరారు.